నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్




దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు

# ఉద్యమ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలుద్దాం

**మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 27: ఉద్యమ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడుదామని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యక్షతన ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి జిల్లాలోని ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో మలిదశ ఉద్యమంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించి ఉద్యమాలు చేసినప్పటికీ అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరాకపోవడంతో 2009లో కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో ' అనే నినాదంతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున రగిలించి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి ప్రతి గొంతుక తెలంగాణ నినాదంతో పోరాడేలా కృషి చేశారని గుర్తు చేశారు. పోరాడి సాధించిన తెలంగాణలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా 10 సంవత్సరాల పాటు కేసీఆర్ కృషి చేశారని కొనియాడారు. కానీ ఈ పది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ప్రజలే బహిరంగంగా చర్చించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ సమాజాన్ని ఏకతాటి పైకి తెచ్చిన కేసీఆర్ స్ఫూర్తితో దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలన్నారు. ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ మాట్లాడుతూ ధోకా బాజీ హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి ఉచిత బస్సు సౌకర్యం తప్పా ఏ హామీనీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్లు అలీబిన్ అహ్మద్, సంజీవ్, మాజీ జడ్పీటీసీలు అజయ్ కుమార్ దుర్పతాబాయి, మాజీ ఎంపీపీ సౌందర్య, నాయకులు అన్సార్, రవి, సాజిద్, రవీందర్, యూనుస్ , కలాం, హకీం, మాజీ సర్పంచులు, కార్యకర్తలు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



# దీక్షా దివస్‌కు సన్నద్ధం

- ఉమ్మడి జిల్లా శ్రేణులను సమన్వయం చేసేలా సన్నాహక సమావేశాలు
- 2009 నవంబర్ 29 ఉద్యమ స్ఫూర్తి గుర్తుకువచ్చేలా దీక్షా దివస్

మంచిర్యాల, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009 నవంబర్ 29న బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష మళ్లీ గుర్తుకువచ్చేలా ఈ నెల 29న దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లా కేంద్రాల్లో ఈ దీక్షా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనుండగా, బీఆర్ఎస్ శ్రేణులతో పాటు తెలంగాణ ఉద్యమ కారులను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. 2009 నవంబర్ 29 గుర్తుకు వచ్చేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుండగా, తెలంగాణలో అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఎండగట్టేందుకు ఈ వేదిక నుంచే బీఆర్ఎస్ శంఖారావాన్ని పూరించనుంది. కేసీఆర్ దీక్షా దివస్‌తో 2009లో ఆంధ్రా పాలకులపై సమరశంఖం పూరించగా, ప్రస్తుతం చేపట్టబోయే దీక్షా దివస్ ద్వారా అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్‌పై శంఖారావం పూరించనున్నారు. దీక్షా దివస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశనం చేసి ఒక్కో జిల్లాకు ఒక్కో ఇన్‌చార్జిని సైతం నియమించారు.

## ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా దీక్షా దివస్

ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నేతల ఆధ్వర్యంలో ఈ దీక్షా దివస్ కార్యక్రమం జరగనుండగా, అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఈ దీక్షా దివస్‌కు తరలివచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసేలా నిర్వహించనున్న ఈ రోజు నుంచే కాంగ్రెస్ పాలనను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఈ దివస్‌ను బీఆర్ఎస్ వేదిక చేసుకోనున్నది. కేసీఆర్ కలలుగన్న తెలంగాణ కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎంత వెనుకబాటుకు గురైందో ఈ వేదికపై వివరించనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ వేదిక ద్వారా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగనుంది.

## ఇన్‌చార్జిల నియామకం

తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌ను మననం చేసుకునేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. ఆదిలాబాద్ జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మంచిర్యాల జిల్లాకు తుల ఉమ, మాజీ జడ్పీ చైర్మన్, ఆసిఫాబాద్ జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావ్, నిర్మల్ జిల్లాకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దీక్షా దివస్‌లకు ఇన్‌చార్జిలుగా ఉండనున్నారు.




ఫొటోలు తీస్తున్న వరల్డ్ వైల్డ్ ఫెడరేషన్ టీం సభ్యులు

## కుశ్నపల్లి రేంజ్‌లో 82 రకాల పక్షి జాతులు

నెన్నెల, నవంబర్ 27 : నెన్నెల మండలంలోని కుశ్నపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో వరల్డ్ వైల్డ్ ఫెడరేషన్ టీం సభ్యులు పర్యటించారు. జోగాపూర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అక్కడ పక్షులు, సీతాకోక చిలుకల ఫొటోలు తీశారు. కుశ్నపల్లి రేంజ్‌లో మొత్తం 82 రకాల పక్షి జాతులను గుర్తించినట్లు రేంజర్ దయాకర్ తెలిపారు.


ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయం గేటు ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

# కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు.. గేటు ఎదుటే రెండు గంటలపాటు బైఠాయింపు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ
- విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- స్వచ్ఛందంగా విద్యాసంస్థలు, దుకాణాల బంద్

**ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతికి నిరసనగా ఆందోళన**

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం అంటూ ఏవీపీఎస్, ఎస్ఎఫ్ఐ,, డీవైఎస్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, బీసీ సంఘం, మాలీ సంఘం నాయకులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. శైలజ కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపును ఇచ్చాయి. ఈ క్రమంలో కలెక్టరేట్ వద్ద పోలీసు బలగాలు భారీ సంఖ్యలో మోహరించాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే మోహరించిన పోలీసులు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. గేట్లు మూసివేయడంతో తోసుకుంటూ వెళ్లడానికి ప్రయత్నించగా.. కొంత ఘర్షణ వాతావరణం నెలకున్నది. దాదాపు గంటపాటు గేట్లు తోసుకుని వెళ్లడానికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయం గేటు ఎదుట విద్యార్థులు సుమారు రెండు గంటలపాటు బైఠాయించారు. దాదాపు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ వెంకటేశ్ ధోత్రే విద్యార్థి సంఘాల నాయకులను పిలిపించుకున్నారు. రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని, మంత్రి సీతక్కతో మాట్లాడామని తెలిపారు. ఇంకా డీటీడీఏపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయి కృష్ణ, డీవైఎస్ఐ జిల్లా కార్యదర్శి గొడిశెల కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ప్రణయ్, మాలీ సంఘం నాయకుడు మెంగాజీ, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయంలోకి విద్యార్థులు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

### న్యాయం చేయాలి..

**విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్**

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ.. శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు, ఐదెకరాల భూమి, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అన్నారు. డీటీడీఏ రమాదేవిని బాధ్యురాలిగా చేస్తూ సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### విద్యా సంస్థల బంద్

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్ పాటించాయి. విద్యార్థి సంఘాల పిలుపు మేరకు పాఠశాలలు, కళాశాలలు ఎక్కడా పని చేయలేదు. విద్యార్థి మృతికి సంతాపంగా విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు మూతపడ్డాయి.

### వ్యాపార సంస్థలు బంద్

శైలజ మృతికి నిరసనగా వాంకిడి మండల కేంద్రంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో చదివే శైలజ స్వగ్రామం కూడా వాంకిడి మండలంలోని దాబా గ్రామమే కావడంతో ఆమె మృతిపై స్పందించిన వ్యాపారులు సంతాప సూచకంగా దుకాణాలను మూసి ఉంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరవలేదు.


విద్యార్థులు , విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


వాంకిడిలో స్వచ్ఛందంగా బంద్ కారణంగా మూసి ఉన్న దుకాణాలు

# వామ్మో..చలి

- సిర్పూర్(యూ)లో 7.9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- రాష్ట్రంలోనే అత్యల్పంగా నమోదు
- గజ గజ వణుకుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు

సిర్పూర్(యూ), నవంబర్ 27: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలను వారం రోజులుగా చలి గజ గజ వణికిస్తున్నది. బుధవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్ (యూ) మండలంలో 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతున్నది. బుధవారం 7.9 డిగ్రీలకు పడిపోవడంతో పాటు చల్లని గాలులు వీస్తుండడంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దుప్పట్లు కప్పుకొని పనులకు వెళ్లే పరిస్థితి నెలకొన్నది. మారుమూల గిరి పల్లెల్లో సాయంత్రం 5 గంటలకే వాకిళ్లలో నెగడి వద్ద మంట కాగుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పడి పోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


సిర్పూర్(యూ)లో మంట కాగుతున్న మహిళలు, చిన్నారులు

# రహదారి నిర్మాణానికి సహకరించాలి

**భూనిర్వాసిత రైతులతో మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్**

జైపూర్, నవంబర్ 27: జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రజలు, భూనిర్వాసిత రైతులు సహకరించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ కోరారు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులతో బుధవారం కుందారం రైతువేదికలో సమావేశం నిర్వహించారు. రైతుల ఆందోళన పరిగణనలోకి తీసుకుని పరిహారం పెంచినట్లు తెలిపారు. కాస్తుదారు పట్టాదారు వివాదాలుంటే సంబంధిత ఆధారాలతో ఆర్డీవో కార్యాలయంలో సంప్రదిస్తే అధికారులు విచారణ చేపట్టి, పరిహారం అందజేస్తారని తెలిపారు. ఈ విషయంలో దళారులను నమ్మవద్దన్నారు. అనంతరం నర్సింగాపురం, కుందారం, శెట్‌పల్లిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జైపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భోజనంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు పాల్గొన్నారు.


కుందారంలో రైతులతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్